
కథ

# అద్దెకొంప

-గోపాలుని రఘుపతిరావు




గుర్నాథం పదిరోజుల్నుంచీ అద్దెకొంప కోసం వెతుకుతున్నాడు. తనకు వరంగల్ నుంచి ఇక్కడికి బదిలీ అయింది. బ్యాంక్‌లో రిపోర్ట్ చేసిందగ్గర్నుంచీ హోటల్‌లో వుంటున్నాడు. ఉదయాన్నే లేవటం, ఇళ్ళవేట ప్రారంభించడం! విజయవాడ తను ట్రాన్స్‌ఫర్ మీద రెండోసారి వచ్చాడు. సిటీల్లో అద్దె ఇళ్ళు చూపించడానికి బ్రోకర్లుంటారు. సుబ్బారావును కాంటాక్ట్ చేశాడు. అతను ఓ బ్రోకర్. ఓ త్రీ స్టోరీడ్ బిల్డింగ్ చూపించాడు. తను వుండబోయేది మూడవ అంతస్థులోనట! అయినా ఈ ఇల్లు తీసుకుంటే ఆఫీసుకు, స్కూళ్ళకు దగ్గరగా వుంటుందని ఒప్పుకున్నాడు గుర్నాథం.

అద్దె పదిహేను వందలట. నీళ్ళకు అదనంగా యాభై రూపాయలు. కరెంట్ బిల్లు సరేసరి! ఇంటాయన మాట్లాడుతూ కరెంటుకు యూనిట్‌పై అదనంగా పావలా ఇవ్వాలన్నాడు.

''అలా ఎందుకండీ?'' అన్న గుర్నాథం ప్రశ్నకు -

''పైన వున్న మూడు పోర్షన్లకు కలిపి ఒకే మీటరు వుంది కాబట్టి, ముగ్గురూ రెండొందల యూనిట్లు కాల్చే అవకాశం వుంది కాబట్టి, యూనిట్‌పై అదనంగా అడిగాను. అంతే!'' అన్నాడాయన.

''మాకు వంద యూనిట్లకన్నా కాలదు లెండి''- భరోసా ఇచ్చాడు గుర్నాథం.

''అయినా ఇవ్వాలి!'' క్రూరంగా నవ్వుతూ అన్నాడు ఇంటాయన.

'సరే'ననక తప్పలేదు గుర్నాథానికి.

''మీటర్ రెంట్ పది రూపాయలు అదనంగా చెల్లించవలసి ఉంటుంద''న్న ఇంటాయన ఉవాచకు గుర్నాథం పేలిపోయి-

''మీటర్ రెంటా? అదేవిటీ?'' అన్నాడు.

''అదంతే! నచ్చితేనే రండి!'' అన్నది ఇల్లుగలాయన అభిప్రాయం.

''ఇంకా ఏమైనా ఉన్నాయా?'' గుర్నాథం పళ్ళుబిగువున అన్నాడు.

''ప్రత్యేకించి ఏమీ లేవనుకోండీ. మేడ మెట్లు వూడ్చినందుకు నెలకు ముప్పై రూపాయలు పనిమనిషికి చెల్లిస్తే చాలు!'' అలవాటుగా కారాకిళ్ళీ నమలటం మూలంగా గారపట్టిన పళ్ళు ఇకిలిస్తూ అన్నాడాయన.

''మా ఆవిడ వూడ్చుకొంటుంది లెండి, మేడ మెట్లు!'' సరదాగా కొట్టిపారేస్తూ అన్నాడు గుర్నాథం.

''నో! మా పనిమనిషితోనే వూడ్పించుకోవాలి. అది నియమం!'' అని ఇల్లుగలాయన రూలింగు ఇచ్చాడు.

''మీకు వాషింగ్ మిషన్ గట్రా ఉన్నాయా?'' క్యూరియస్‌గా అడిగాడు ఓనరుబాబు.

''అవునండీ! ఈ రోజుల్లో బట్టలు ఉతకడం కూడా నంటే శ్రమే కదండీ! ఆడాళ్ళ కష్టాలు మగవాళ్ళు కాకపోతే మరెవరు తీరుస్తారు. అందుకే బట్టలుతికే మిషన్ కొనుక్కున్నామండీ!'' త్రికరణ శుద్ధిగా చెప్పాడు గుర్నాథం.

''మీరు వాషింగ్ మెషీన్ వాడటానికి వీలులేదు''

''అదేం? కరెంట్ మేమే భరిస్తాంగా'' అర్థంకాక అన్నాడు గుర్నాథం.

అటు ఆఫీసుకు, ఇటు పిల్లాళ్ళ స్కూళ్ళకు దగ్గరగా వున్న నేపథ్యంలో ఆ ఇంటిపై మమకారం చూపిస్తున్న గుర్నాథం మనోభీష్టాన్ని 'క్యాష్' చేసుకో ప్రయత్నిస్తున్న ఇంటి ఓనరు ప్రవర్తనను ఓరగా గమనిస్తున్నాడు గుర్నాథం వుడ్‌బీ కోటెనెంట్ ఒకాయన. కానీ ఆయన వారి సంభాషణలో జోక్యం కల్పించుకునే సాహసం చేయలేయపోయాడు.

''కరెంట్ మీరే భరిస్తారండీ, కానీ తరతరాలుగా మమ్మల్నే నమ్ముకొని వున్న మా ఇంటి చాకలితోనే అన్ని వాటాల వాళ్ళు ఉతికించుకుంటున్నారు. మీరూ ఉతికించుకోవాలి!' కళ్ళెగరేస్తూ చెప్పాడు ముసలి ఓనరు!

''చూడండి ఓనరుగారు! మాకూ ఇల్లుంది తెనాలిలో. అయినా నేను ఇన్ని కండీషన్లు పెట్టనంటే అది అతిశయోక్తి కాదండీ. మీరు పెద్ద మనసు చేసుకొని కొంచెం సహకరించాలి!'' అన్న సరసోక్తికి ఇల్లుగలాయన-

''అది మీ స్వవిషయం. తెనాలిలో ఎన్ని షరతులు పెడతారో, పెట్టరో నాకు అప్రస్తుతం. మా ఇల్లు అద్దెకిచ్చే ప్రతీవారికీ ఈ నిబంధనలు చెబుతూనే ఉన్నాను. ఇప్పుడూ అంతే! మీకు ఇష్టమైతేనే చేరండి, లేకపోతే లేదు. నాకు ఒహర్ని చిరాకు పెట్టడమంటే బహు అసహ్యం. ఇంట్లో చేరాక చూస్తారు నా మంచితనం'' స్వగతంగా అన్నాడు ఇంటాయన.

''అవును, తెలుస్తూనే ఉంది మీ మంచితనం!'' స్వగతంగా అనుకున్నాడు గుర్నాథం.

''ఏదో అంటున్నట్లున్నారు, నాకు మెల్లిగా మాట్లాడితే అంత బాగా వినపడదు'' అన్న ఓనరు మాటలకు

''అదొక్కటే మీ సుగుణంగా కనపడుతోంది'' మరలా స్వగతంగా అనుకున్నాడు గుర్నాథం.

''గుసగుసగా మాట్లాడితే నాకు వినపడదు సుమండీ!'' అన్న ఇంటాయన ఉవాచకు.

గుర్నాథం గుంభంగా ఉండిపోయాడు.

''అయితే బ్రోకరు బాబూ, సారుకి ఇల్లు నచ్చినట్లుంది, 'కిరాయినామా' రాసుకుందాం''

''నచ్చడమంటూ ఏమీ లేదు. నాకో అద్దెకొంప కావాలి. అందులో కొన్ని కనీస వసతులు ఉండాలి. అవి మీ కొంపలో ఉన్నాయి!'' అన్న మాటలు గుర్నాథం పెదవి చివర్న ఆగిపోయాయి.

''మేముండబోయేది రెండో ఫ్లోర్‌లో గదా, వెహికల్ ఎక్కడ పెట్టుకోవాలి?'' అన్న గుర్నాథం సంశయానికి ఇల్లుగలాయన ఇలా సమాధానమిచ్చాడు.

''మా కిరాయిదార్లకు ఎలాంటి చిన్న ఇబ్బందీ కలగటం నేను సహించలేని కారణంగా ఓ గేరేజీ గ్రౌండ్‌ఫ్లోర్‌లో కట్టించాను. నెలకో యాభై కిరాయి చెల్లిస్తే చాలు!''

''అయ్‌బాబోయ్! అదనంగా యాభై రూపాయలా?'' గొల్లుమన్నాడు గుర్నాథం.

''ఇకపోతే అడ్వాన్సు విషయం!'' ఇంటాయన కంటిన్యూ చేశాడు. ''ఓ అయిదువేలు పే చేయాలి. ఇల్లు ఖాళీ చేసేప్పుడు రిటర్న్ చేస్తాం. అంటే మీరు ఖాళీచేసే పోర్షన్ ఆక్యుపై చేసే వారి దగ్గర మీరు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. సూత్రప్రాయంగా అంతే! కాని విషయపరంగా బ్రోకరు సుబ్బారావే ఆ పనిచేసి పెడ్తాడు''

''ఇంకా ఏమైనా నిబంధనలున్నాయా?'' అని వచ్చే ఏడుపును గొంతులోనే ఆపుకుంటూ అన్నాడు గుర్నాథం.

''ఆర్థికపరమైనవి ఏమీ లేవు. కానీ. సామాజికపరంగా కొన్ని. చుట్టాలు గట్రా వస్తే రెండు మూడు రోజుల కన్నా మించి ఉండకూడదు. నీరు పొదుపుగా వాడాలి. కిరాయి ఠంచనుగా ఒకటోతేదీ ప్రొద్దున్నే చెల్లించాలి'' ఇల్లుగలాయన సమాధానం.

గుర్నాథం అయిదువేలకు 'చెక్కు' ఇచ్చాడు. ఇన్‌కంటాక్స్ ప్రాబ్లెంస్ కారణంగా 'చెక్' స్వీకరించలేననీ, ప్రతీనెలా కిరాయి కూడా 'క్యాష్' మాత్రమే చెల్లించాలనీ తన అశక్తతను వ్యక్తపరిచాడు ఓనరు.

''అయితే మున్సిపాలిటీ వాళ్ళకు కిరాయి మూడొందలని మాత్రమే చెప్పాలా?'' అని ఆవేశాన్ని ఆపుకుంటూ అడిగిన గుర్నాథానికి లభించిన సమాధానం.

''అలా కాకుండా ఉన్నదున్నట్లు చెబితే, వాళ్ళు ఎక్కువ వేసే పన్ను మీ దగ్గరే వసూలు చేయాలి గదండీ?! ఎందుకొచ్చిన తంటా?!''

గుర్నాథం కొత్త ఇంట్లోకి ఫ్యామిలీ షిఫ్ట్ చేశాడు. ఇంటాయన చాలా 'కోఆపరేట్' చేశాడా సందర్భంలో.

సుబ్బారావుకు ఇల్లు కుదిర్చిన 'బ్రోకరేజీ' అయిదొందలు అన్నప్పుడు మరలా 'గొల్లుమని వాపోయాడు' అనుకుంటే పొరపాటే సుమా? అతని అనుభవాలు అలాంటివి మరి.

సుబ్బారావు వాలుకుర్చీలో కూర్చుని 'టీ' సిప్ చేస్తున్నాడు. అద్దె ఇళ్లలో అతని అనుభవాలు ఈనాటివా? ఇరవై ఏళ్ళ నుంచీ ఆ అమరసుఖాలు అతనెరుగును. తనకూ ఓ కొంప ఉంది. తనూ దానిని కిరాయికే ఇస్తున్నాడు ఇన్నాళ్ళ నుంచీ. కానీ తను అంత క్రూరంగా ప్రవర్తిస్తున్నాడా? ఎట్‌లీస్ట్, తను! ఓ 'ఆదర్శ' హౌస్‌ఓనర్‌గా వ్యవహరిస్తానని ఓ చరిత్ర ప్రసిద్ధ నిర్ణయం తీసుకున్నాడా ప్రభాత సమయంలో. భార్యతో విషయం ముచ్చటించాడు.

తను తన వూళ్ళోని స్వంత ఇంటిని ఆదర్శంగా అద్దెకిస్తానన్నపుడు భార్య ఫక్కున నవ్వినపుడు గుర్నాథం తనాపని విజయవంతంగా చేసి చూపిస్తానన్నాడు.

రెండు ఏడాదులు విజయవాడలో గడిచాక తెనాలికి మరలా బదిలీ అయి స్వగ్రామ వాసానికి శ్రీకారం చుట్టాడు గుర్నాథం.

తన ఇల్లు రెండు పోర్షన్లు కలిగివున్న కారణంగా ఓ వాటాలో తను వుండి రెండో వాటా అద్దెకిచ్చే అవకాశం ఉంది.

అద్దెకిచ్చే వాటాకు 'టు-లెట్' బోర్డు పెట్టాడు మిస్టర్ గుర్నాథం. టెనెంట్స్ బ్రోకరేజీ చెల్లించే అవసరం తన వూళ్ళోలేని పరిస్థితికి ఆనందించాడు.

ఒక్కొక్కరే రాసాగారు. ఆ వూళ్ళో ఆ సైజు, సౌకర్యాలు ఉన్న ఇంటికి వుండే అద్దెకి నూరు రూపాయలు తగ్గించి కిరాయి చెప్పాడు గుర్నాథం. నో మీటర్ ఛార్జ్. నో వాటర్ ఛార్జ్. మేడ మెట్లు, వసారాను తమ సర్వెంట్ మెయిడే వూడ్చే ఏర్పాటు చేశాడు.

వాషింగ్ మిషన్లు, ఎయిర్‌కూలర్లు నిరభ్యంతరంగా వాడుకునే సహృదయత వెల్లడించాడు.

ఇలా 'ప్రాస్పెక్టివ్ టెనెంట్స్'కు గుర్నాథం కల్పించిన రాయితీలు అనేకం!

అద్దెవాళ్ళు వస్తున్నారు, పోతున్నారు. కానీ ఒక్కరూ ఫిక్స్ చేసుకున్న దాఖలా కనిపించలేదు గుర్నాథానికి. ఒకసారి వచ్చి ఇల్లు చూసుకొనిపోయిన వారు మరలా రాలేదా ఇంటివైపు.

రెండు మూడు నెలలు గడిచాయి. 'టులెట్' బోర్డు వెలతెలా పోయింది.

గుర్నాథం ఆరాతీస్తే తెలిసిందేమంటే ఏ లోపమూ ఇంట్లో లేకపోతే ఇల్లుగలవాళ్ళు అన్ని రాయితీలు, తక్కువ అద్దె ఎందుకు ఫిక్స్ చేసి ఉంటారు! తీరా చేరాక అసలు సమస్యలు ఎదురయితే మాటిమాటికీ ఇళ్ళు మారటం అంటే మాటలా!? అన్నది అద్దెకొచ్చేవారికి ఎదురయిన సందిగ్ధం! ట!!

ఇంకేం చేస్తాడు మన గుర్నాథం? అద్దె ఇంటి యజమాని అవతారం ఎత్తేశాడు. తను తగ్గించి రాయితీ ఇచ్చిన నూరు రూపాయల రాయితీతోపాటు అనేకమైన 'డిక్లేర్' చేసిన రాయితీలకు 'సున్నా' చుట్టాడు. అందరూ ఇండ్ల యజమానుల్లాగే ప్రవర్తించటం నేర్చుకున్నాడు. ఇహనేం? నెల తిరగేలోగా 'టులెట్' బోర్డు తీసివేయడం జరిగింది. ఓ ఫ్యామిలీ గుర్నాథంగారి ఇంట్లో కిరాయికి చేరారు.

గుర్నాథంగారి ఫ్రెండ్ ఒకాయన జరిపిన అనఫీషియల్ సర్వేలో ఇంట్లో చేరిన అద్దెవారు ఉటంకించిన రహస్య సమాచారమేమంటే -

''అవేవో అన్ని రాయితీలు ఇస్తుంటే ఏమో అనుకున్నాం. ఆహార వ్యవహారాల్లో మొహమాటం పనికిరాదు సుమా? ఆయన నిర్మొహమాటంగా చెప్పిన అద్దె విషయం; నియమాలు మాకు నచ్చాయి. అంటే మేం కూడా నిర్మొహమాటంగా ఇంటి వాళ్ళతో వ్యవహరించే అవకాశం మాకూ వున్నట్లే గదా?!''

గుర్నాథం-గారికి విషయం విని సంతోషించాలో లేదో అర్థంకాకపోయినా ఇల్లు ఖాళీగా పెట్టే దురవస్థ తప్పినందుకు మాత్రం సంతోషించాడు. ●